నమస్తే తెలంగాణ
జగిత్యాల
5 కరీంనగర్, శుక్రవారం 28 మార్చి 2025 JAGTIAL

## పెద్ద మొత్తంలో కమీషన్లు?

ఈ దందాలో ప్రైవేట్ అంబులెన్స్ నిర్వాహకులు, 108 సిబ్బంది, గ్రామీణ ప్రాంతాల్లోని కొందరు ఆర్ఎంపీలు.. ఇలా అందరికీ కమీషన్లు ముడుతున్నట్టు తెలుస్తున్నది. విచిత్రం ఏమిటంటే కమీషన్ల కోసం జీజీహెచ్‌లో పనిచేసే కొందరు వైద్యులు కూడా పరీక్షల కోసం ప్రైవేట్ ల్యాబ్‌కు పేషెంట్లను పంపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. తీరా రిపోర్టులు చూసి ఇక్కడ సదుపాయాలు లేవని, వేరే దవాఖానలకు వెళ్లాలని సిఫారసు చేస్తున్నట్టు సమాచారం. లబోదిబోమంటున్న క్షతగాత్రులు, రోగులు తప్పనిపరిస్థితుల్లో ప్రైవేట్ దవాఖానలకు వెళ్తున్నారు. ముఖ్యంగా ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులను అంబులెన్స్ డ్రైవర్లు చిన్న చిన్న ప్రైవేట్ దవాఖానాల్లో చేర్పిస్తున్నారు. అక్కడ వైద్య సదుపాయాలు లేక ప్రాణాల మీదికి వస్తున్నది. ఇటీవల సుల్తానాబాద్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను స్థానిక ఓ ప్రైవేట్ హాస్పిటల్లో చేర్పించగా, సరైన చికిత్స అందక ముగ్గురు మృతి చెందారనే ఆరోపణలున్నాయి. క్షతగాత్రుల ప్రాణాలు ఏమైతే మాకేం.. మా కమీషన్ మాకు వస్తే చాలనే రీతిలో ప్రైవేట్ అంబులెన్స్ నిర్వాహకులు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా జనరల్ హాస్పిటల్ అధికారులు, పోలీసులు చొరవ తీసుకుని ఈ అక్రమ దందాను అరికట్టాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.









కరీంనగర్ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ ఎదుట మోహరించిన ప్రైవేట్ అంబులెన్స్‌లు

# జీజీహెచ్ అడ్డాగా..
# అంబులెన్స్‌ల దందా!

- కరీంనగర్ జనరల్ హాస్పిటల్ చుట్టూ వాహనాలు
- కొంతమంది 108 అంబులెన్స్ సిబ్బందితో దోస్తీ!
- అత్యవసర చికిత్స కోసం తీసుకొచ్చిన బాధితులను ప్రైవేటుకు తరలించి కమీషన్లు
- వ్యతిరేకించే 108 సిబ్బందితో గొడవలు
- పోలీసులకు తరచూ ఫిర్యాదులు
- వైద్యులు, సిబ్బందిపైనా విమర్శలు




108 వాహనం నుంచి ప్రైవేట్ అంబులెన్స్‌లోకి క్షతగాత్రుడిని మార్చుతున్న దృశ్యం

**కరీంనగర్ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ (జీజీహెచ్) అడ్డాగా అంబులెన్స్‌ల దందా జోరుగా సాగుతున్నది. అత్యవసర సమయాల్లో చికిత్స కోసం జీజీహెచ్‌కు వచ్చిన పేషెంట్లను కమీషన్ల కోసం ప్రైవేట్ దవాఖానలకు తరలిస్తున్నట్టు వెలుగులోకి వస్తున్నది. అయితే, కొంతమంది 108 సిబ్బంది ఈ దందాను వ్యతిరేకిస్తున్నా.. మరికొంత మంది సిబ్బంది మాత్రం కాసుల కక్కుర్తితో ప్రైవేట్ అంబులెన్స్ నిర్వాహకులకు సహకరిస్తున్నట్టు తెలుస్తున్నది. క్షతగాత్రులను అర్హత లేని హాస్పిటళ్లకు తరలించి ప్రాణాల మీదకు తెస్తున్నారనే విమర్శలు వస్తుండగా, దీనిపై జీజీహెచ్ అధికారులు పలుసార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు లేకపోవడంతో దందా అడ్డూఅదుపు లేకుండా పోతున్నది.**

కరీంనగర్, మార్చి 27 (నమస్తే తెలంగాణ)/విద్యానగర్ : ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు ప్రస్తుత మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలకు ఏకైక పెద్ద దవాఖాన కరీంనగర్ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ (జీజీహెచ్). ఇక్కడికి నిత్యం వేలాది మంది పేషెంట్లు వస్తుంటారు. ఎక్కడ ఏ ప్రమాదం జరిగినా.. ఇతరత్రా ప్రాణాపాయ స్థితిలో అయినా పేషెంట్లను ఘటనా స్థలం నుంచి 108 వాహనాల్లో ఇక్కడికి చేరుస్తుంటారు. అయితే, ఇదే అదునుగా ప్రైవేట్ దవాఖానల నెట్‌వర్క్ దందా వెలుగు చూస్తున్నది. పేషెంట్ జీజీహెచ్‌కు రావడమే ఆలస్యం.. ఈ దవాఖాన చుట్టూ మోహరించి ఉన్న ఏదో ఒక ప్రైవేట్ అంబులెన్స్ నిర్వాహకులు వెంటనే తమ వాహనంలో పేషెంట్‌ను మార్చుకొని ప్రైవేట్ దవాఖానలకు తరలించడం నిత్యకృత్యంగా మారింది. ఇదంతా ఒక నెట్‌వర్క్ సిస్టంలో జరుగుతున్నదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇందులో ప్రైవేట్ అంబులెన్స్ నిర్వాహకులు, 108 సిబ్బంది, గ్రామీణ ప్రాంతాల్లోని కొందరు ఆర్ఎంపీలకు కమీషన్లు ముడుతున్నట్టు తెలుస్తుండగా, దవాఖానలో పనిచేసే కొందరు వైద్యులు, సిబ్బందిపైనా ఆరోపణలు వస్తున్నాయి. మొదట ఘటన జరిగినప్పుడు ఆర్ఎంపీ, పీఎంపీలు జనరల్ హాస్పిటల్ ముందు తమకు అనుకూలంగా ఉన్న ప్రైవేట్ అంబులెన్స్ నిర్వాహకులకు ఫోన్లు చేసి చెప్పడం, ఆ తర్వాత వాళ్లు జీజీహెచ్ నుంచి ప్రైవేట్ దవాఖానలకు తరలించి రూ.వేలకు వేలు కమీషన్లు తీసుకుంటున్నట్టు తెలుస్తున్నది. ఈ వ్యవహారంలో కొంతమంది 108 సిబ్బంది పాత్ర ప్రధానంగా ఉందనే ఆరోపణలు వస్తున్నాయి. ఘటనా స్థలం నుంచి పేషెంట్లను తీసుకొస్తున్న క్రమంలోనే ప్రైవేట్ అంబులెన్స్ నిర్వాహకులకు సమాచారం అందిస్తున్నారనే విమర్శలున్నాయి. అయితే, ఈ దందా ఇష్టం లేని కొందరు 108 పైలెట్స్, టెక్నికల్ సిబ్బంది మాత్రం ప్రైవేట్ అంబులెన్స్‌ల నిర్వాహకులను ఎదిరించి, నిబంధనల ప్రకారం జనరల్ హాస్పిటల్లోనే జాయిన్ చేయిస్తున్నారు. అయితే, ఆ తర్వాత కూడా కొన్ని ప్రైవేట్ దవాఖానల నెట్‌వర్క్ సిబ్బంది క్షతగాత్రులను ఏదో విధంగా మోటివేట్ చేసి అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తున్నట్టు తెలుస్తున్నది. ఈ విషయమై ఇప్పటికే మూడుసార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు అధికారులు చెబుతున్నా, ఇప్పటి వరకు ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తున్నది.



ఓ ప్రైవేట్ అంబులెన్స్‌లోకి క్షతగాత్రుడిని మార్చుతున్న దృశ్యం

### రోజుకు సగటున 40 కేసులు?

ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్‌లో 16 , జగిత్యాలలో 15, సిరిసిల్లలో 12, పెద్దపల్లిలో 10 అంబులెన్స్(108) వాహనాలు సేవలందిస్తున్నాయి. ఒక్క కరీంనగర్ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌కు రోజుకు 35 నుంచి 50 కేసులు 108 ద్వారా వస్తున్నాయి. సగటున 40 కేసులు ఉంటున్నాయి. ఈ జీజీహెచ్‌లో న్యూరో, కార్డియాలజీ మినహా ఆర్థో, ఫిజీషియన్, గైనిక్ విభాగాలు బాగానే పని చేస్తున్నాయి. అయితే, ఆర్థో విభాగం పటిష్టంగా ఉన్నా ప్రాథమిక చికిత్స చేసి వరంగల్‌కు రెఫర్ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. కాళ్లు, చేతులు ఇతర శరీర భాగాల్లో ఎక్కడ గాయాలైనా చికిత్స అందించే సదుపాయం ఉంది. కానీ, రోజుకు సగటున 20 మందిని ఇతర ప్రభుత్వ దవాఖానలకు రెఫర్ చేస్తున్నట్లు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో క్షతగాత్రులు అంత దూరం వెళ్లలేక కరీంనగర్‌లోని ఏదో ఒక ప్రైవేట్ దవాఖానకు వెళ్లాల్సి వస్తున్నది. ఇదే సమయంలో ప్రైవేట్ అంబులెన్స్‌ల నిర్వాహకులు క్షతగాత్రులను తరలించే విషయంలో గొడవలకు దిగుతున్నట్టు తెలుస్తున్నది. నిజానికి 108 సిబ్బంది క్షతగాత్రులను జనరల్ హాస్పిటల్‌కు తరలించిన తర్వాత ఇక్కడే అడ్మిట్ చేసుకోవాల్సి ఉంటుంది. కొందరిని అడ్మిట్ చేసుకోకుండా ప్రాథమిక చికిత్సలాంటిది చేసి రెఫర్ చేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఇలా చేయడం వల్ల క్షతగాత్రులు ఉన్న కొద్ది విలువైన సమయం వృథా అయి ప్రాణాల మీదికి వస్తున్నది. ఈ పరిస్థితుల్లో ఇక్కడే ఏదో ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో జాయిన్ అయ్యే పరిస్థితిని కల్పిస్తున్నారనే ఆరోపణలు పెద్ద ఎత్తున వస్తున్నాయి. అయితే, ఎలాంటి ఎక్విప్‌మెంట్స్ లేని ఒక ప్రైవేట్ దవాఖానకే ఎక్కువ మంది క్షతగాత్రులను తరలిస్తున్నట్టు తెలుస్తున్నది. నిజానికి జీజీహెచ్‌లో సీటీ స్కాన్ సదుపాయం లేదు. తలకు గాయాలైన వారిని ఇతర ప్రభుత్వ దవాఖానలకు రెఫర్ చేయడంలో అర్థం ఉంటుందిగానీ, ఆర్థో కేసులను కూడా రెఫర్ చేయడం చూస్తే వైద్యులు చికిత్స అందించ లేకనే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

### పోలీసుల దృష్టికి తీసుకెళ్లాం



గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో పనిచేసే సెక్యూరిటీ, పీఆర్‌వోలతో పాటు సిబ్బందితో ప్రైవేట్ అంబులెన్స్ సిబ్బంది రోజూ గొడవలకు దిగుతూ పేషెంట్లను ప్రైవేట్ దవాఖానలకు తరలిస్తున్నారు. దీనిపై ఇప్పటికే నాకు ఫిర్యాదులు వచ్చాయి. కొంతమంది అంబులెన్స్ సిబ్బందిపై పోలీసులకు ఫిర్యాదు చేశాను. అయినా, వారి ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. మూడు రోజుల కిందట 108లో వచ్చిన పేషెంట్‌ను బలవంతంగా ప్రైవేట్ అంబులెన్స్‌లో ప్రైవేట్ దవాఖానకు తరలించారు. దీనిపై సైతం పోలీసులకు ఫిర్యాదు చేశాను.

**- గుండా వీరారెడ్డి, జీజీహెచ్ సూపరింటెండెంట్ (కరీంనగర్)**

## చక్కెర ఫ్యాక్టరీని తెరిపించండి

### శాసనసభలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

మెట్‌పల్లి, మార్చి 27 : తమ నియోజకవర్గంలోని ముత్యంపేట నిజాం చక్కెర ఫ్యాక్టరీని తెరిపించి చెరుకు రైతులను ఆదుకోవాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల డిమాండ్ చేశారు. గురువారం శాసనసభ జీరో అవర్‌లో ఆయన మాట్లాడారు. మూతపడిన నిజాం చక్కెర ఫ్యాక్టరీని తెరిపిస్తామని ఎన్నికల వేళ రైతులకు హామీ ఇచ్చారని, తీరా అధికారంలోకి వచ్చాక కమిటీ వేస్తామని చెప్పి కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఈ చక్కెర ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ జరిగిందని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ 2014-15లో రైతులతో సహకార సంఘం ఏర్పాటు చేసి చక్కెర ఫ్యాక్టరీ నిర్వహణ బాధ్యతలు రైతులకే ఇద్దామనే ఆలోచన చేశారని గుర్తు చేశారు. 2004లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చక్కెర ఫ్యాక్టరీ ప్రైవేటీకరణపై ఒక కమిటీ వేసిందని, ఆ కమిటీలో అప్పటి స్థానిక ఎమ్మెల్యే కొమిరెడ్డి రాములును, ఇప్పుడు ఈ ప్రభుత్వం వేసిన కమిటీలో స్థానిక శాసనసభ్యుడినైన తనను చేర్చలేదన్నారు. చెరుకు రైతుల పక్షాన తన తండ్రి, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు నిరాహార దీక్ష కూడా చేశారని గుర్తు చేశారు. రైతుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తేవడానికి ఆ కమిటీలో తనకు స్థానం కల్పించాలన్నారు. చెరుకు రైతుల సమస్యల పరిష్కారం కోసం వెంటనే చక్కెర ఫ్యాక్టరీని తెరిపించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.



## పెట్రోల్ బంక్‌లో కూల్ కూల్..

కొద్ది రోజులుగా ఎండ దంచుతున్నది. ఉదయం తొమ్మిది గంటల నుంచే ప్రతాపం చూపుతున్నది. గరిష్ఠంగా 38 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా, మధ్యాహ్నంకల్లా భగ్గుమంటున్నది. ఎండ తీవ్రత పెరగడంతో కరీంనగర్‌లోని జ్యోతినగర్, భాగ్యనగర్ మధ్యలో ఉన్న ఓ పెట్రోల్ బంక్ నిర్వాహకులు చల్లదనం కోసం వినూత్నంగా ఆలోచించారు. బంక్‌లో స్ప్రేయర్లు ఉంచి నీటిని స్ప్రే చేస్తున్నారు. దీంతో వచ్చే వాహనదారులకు చల్లదనం ఉంటున్నదని చెబుతున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కరీంనగర్



మంటల్లో కాలుతున్న డస్ట్ బిన్ చక్రాలు

## మరీ ఇంత నిర్లక్ష్యమా?

చెత్త సేకరణ కోసం కరీంనగర్‌లోని కాలనీల్లో ఏర్పాటు చేసిన డస్ట్ బిన్‌ల నిర్వహణలో నెలకొన్న నిర్లక్ష్యంతో అవి ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి. అందుకు రేకుర్తి విజయపురికాలనీలోని డస్ట్ బినే నిదర్శనం. డబ్బా చుట్టూ పేరుకుపోయిన చెత్తకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో మంట కాస్తా చెత్త డబ్బా చక్రాలకు అంటుకొని పూర్తిగా కాలిపోయాయి. దీంతో ఆ డస్ట్ బిన్‌ను కదిలించడానికి కూడా వీలు లేకుండా మారింది.

**- ముకరంపుర, మార్చి 27**



నగరంలోని మంచినీటి రిజర్వాయర్లు

- కరీంనగరంలో మొదలైన తాగునీటి గోస
- ఎల్ఎండీలో పడిపోతున్న నీటిమట్టం
- కనిపించని ముందస్తు వేసవి ప్లాన్!
- శివారు కాలనీల్లో మొదలైన ప్రెషర్ తిప్పలు
- నేటి నుంచి డే బై డే సప్లై?

# గాడి తప్పుతున్న
# నీటి సరఫరా!

**కరీంనగరంలో తాగునీటి సరఫరా గాడి తప్పుతున్నది. అధికారుల సమన్వయ, ప్రణాళికా లోపాలతో ఎద్దడి మొదలవుతున్నది. ఎల్ఎండీలో రోజురోజుకూ నీటి నిల్వలు పడిపోతుండడం, అధికారుల ముందస్తు సమ్మర్ ప్లాన్ లేకపోవడంతో ఇప్పటికే పలు రిజర్వాయర్ల పరిధిలో రోజు తప్పించి రోజు నీరు వస్తున్నది. నేటి నుంచి అన్ని కాలనీల్లోనూ ఇలానే ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలుస్తుండగా, ముమ్ముందు తాగునీటి ముప్పు తీవ్రమయ్యే కనిపిస్తున్నది.**



అడుగంటుతున్న ఎల్ఎండీ జలాశయం

కరీంనగర్ కార్పొరేషన్, మార్చి 27 : కేసీఆర్ పాలనలో మండు వేసవిలో కూడా కరీంనగర ప్రజలకు ప్రతి రోజూ మంచి నీటి సరఫరా అయ్యేది. అందుకోసం ముందస్తుగానే సమ్మర్ ప్లాన్ సిద్ధం చేసేది. ఎల్ఎండీలో అవసరమైన మేరకు నీటి నిల్వలు ఉంచేది. కానీ, ప్రస్తుతం నగరపాలక సంస్థలో అవేవీ కనిపించడం లేదు. ఓ వైపు ఎల్ఎండీలో నీటిమట్టం రోజురోజుకూ పడిపోతున్నా ముందస్తు జాగ్రత్తలు కనిపించడం లేదు. అలాగే సమ్మర్ ప్లాన్‌పై ఇంజినీరింగ్ విభాగం ఇప్పటి వరకు దృష్టి సారించిన దాఖలాలు లేవు. నగరంలో 62 వేల నల్లా కనెక్షన్లు ఉండగా, ప్రతి రోజూ 60 ఎంఎల్‌డీ నీటి సరఫరా చేస్తున్నారు. నగరంలోని అంబేద్కర్ నగర్, రాంపూర్, మార్కెట్ రిజర్వాయర్ పరిధిలో ఈ నెల మొదటి నుంచే రోజు తప్పించి రోజు మంచినీటి సరఫరా చేస్తున్నారు. ఇటీవల ఎస్సారార్, కోర్టు రిజర్వాయర్ల పరిధిలోనూ రోజు తప్పించి రోజు నీటి సరఫరా చేపడుతున్నారు. మిగిలిన ప్రాంతాల్లో రోజూ నీటి సరఫరా చేస్తున్నా ఇబ్బందులు మాత్రం వస్తూనే ఉన్నాయి.

### ఇక రోజు తప్పించి రోజు

నగరంలో ప్రస్తుతం సాగిస్తున్న రోజూ మంచినీటి సరఫరాకు నగరపాలక అధికారులు మంగళం పాడేందుకు సిద్ధమయ్యారు. శుక్రవారం నుంచి అన్ని ప్రాంతాల్లో రోజు తప్పించి రోజు మంచినీటి సరఫరా చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించినట్టు తెలుస్తున్నది. ఇప్పటికే నీటి సరఫరా విభాగంలోని కిందిస్థాయి సిబ్బందికి ఆదేశాలు వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం కాగా, ఈ విషయంలో ఇంజినీరింగ్ విభాగంలోని రిజర్వాయర్ల వారీగా ఉన్న అధికారుల్లో ఒక్కొక్కరు ఒక్కో తీరుగా మాట్లాడుతున్నారు. ఇక నుంచి రోజు తప్పించి రోజు నీటి సరఫరా అవుతుందని కొందరు చెబుతుంటే.. మరి కొందరు ఇంకా నిర్ణయం తీసుకోలేదంటున్నారు. ఏడాదిన్నర కింద కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మే నెలలో రోజు విడిచి రోజు నీటి సరఫరా చేశారు. అయితే ఈ సారి మాత్రం వేసవిలో మార్చి చివరి నుంచే చేసే ఈ పరిస్థితి రావడంపై విమర్శలు వస్తున్నాయి.

### రానున్న రోజుల్లో తిప్పలే

నగరంలో పరిస్థితి చూస్తే రానున్న రోజుల్లో తాగు నీటి సరఫరాకు మరిన్ని తిప్పలు వచ్చేలా ఉన్నాయి. ముఖ్యంగా ఇప్పటికే అనేక శివారు కాలనీల్లో నల్లా నీరు తగినంత ప్రెషర్ రావడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. వీటికి తోడు పైపులైన్ల లీకేజీ కూడా పెరిగిపోతుండడం.. ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయకపోవడంతో కిసాన్ నగర్, తదితర ప్రాంతాల్లో మురుగునీరు వస్తుందన్న ఫిర్యాదులు ఉన్నాయి. వీటితోపాటు ఆరెపల్లి, సీతారాంపూర్, విద్యానగర్, తదితర ప్రాంతాల్లో నీటి సరఫరా ప్రెషర్ ఉండడం లేదన్న ఫిర్యాదులు వస్తున్నాయి. దీనికి తోడు రిజర్వాయర్ల పంపింగ్ విషయంలో ఇంజినీరింగ్ అధికారుల మధ్య సమన్వయం లోపించడంతో కొన్ని ప్రాంతాల్లో నీటి సరఫరాలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇటీవల నగరపాలక సంస్థలో విలీనమైన గ్రామాల్లో నీటి సరఫరా విషయంలోనూ అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. వేసవి విషయంలో ప్రత్యేక దృష్టి సారించకపోతే నీటి సరఫరాకు తీవ్ర ఇబ్బందులు వచ్చే ప్రమాదమున్నది.

## రూ.3 లక్షలు పెట్టినా
## పొలం దక్కలే

మాకు మూడెకరాల భూమి ఉంది. ఇద్దరం అన్నదమ్ములం కలిసే వ్యవసాయం చేస్తున్నం. గతంలో నీటికి ఇబ్బందులు లేకపోవడంతో మంచి పంటలు పండినయ్. ఈసారి కూడా పంట పండుతదనే ఆశతో మూడెకరాల్లో వరి వేసినం. కానీ, భూగర్భ జలాలు అడుగంటినయ్. బావిల నీళ్లు లేకపోవడంతో క్రేన్ కిరాయికి తెచ్చుకొని కుటుంబ సభ్యులమే బావి తవ్వినం. మొత్తంగా రూ.3 లక్షల దాకా ఖర్చు పెట్టినం. కానీ, నీళ్లు సరిపడా రాక సగం పొలం విడిచి పెట్టినం. మా భూమి పక్కకే ఎస్సారెస్పీ పిల్ల కాలువ ఉంది. ముందే నీళ్లిస్తే పొలం ఎండకపోయేది. ఇప్పుడు ఇస్తున్నరు. ఏం లాభం? జరగాల్సిన నష్టం జరిగింది. **- శీల సతీశ్, అడవిశ్రీరాంపూర్ (ముత్తారం)**



ఎండిన పొలాన్ని చూపిస్తున్న సతీశ్